

'మల్లన్నసాగర్' భూమి
పరాధీనం!



తొగుట మండలం తుక్కాపూర్ గ్రామశివారులో నిర్మిస్తున్న అదనపు టీఎంసీ పంప్‌హౌజ్

- అదనపు టీఎంసీ నిర్మాణానికి సేకరణ
- ఆ భూములపై అక్రమార్కుల కన్ను
- ఇరిగేషన్ అధికారులు విన్నవించినా పట్టించుకోని వైనం
- ఆన్‌లైన్ చేయకపోవడంతో మళ్లీ రిజిస్ట్రేషన్లు
- తహసీల్దార్ కార్యాలయంలో దళారుల దందా!
- చోద్యం చూస్తున్న అధికారులు

తొగుట, ఆగస్టు 2 : అధికారుల నిర్లక్ష్యం... దళారుల పాలిట వరంగా మారుతుంది. అందరికీ మేలు చేకూరుతుందని భావించి రైతులు తమ భూములను ప్రభుత్వానికి అప్పగిస్తే.. వాటిని ఆన్‌లైన్ చేయకపోవడంతో కొందరు ఆ భూములపై కన్నేసి మళ్లీ రిజిస్ట్రేషన్లకు తెరలేపుతున్నారు.



తుక్కాపూర్ శివారులో అదనపు టీఎంసీ కాలువ పనులు

మల్లన్నసాగర్ అదనపు టీఎంసీ కాలువ నిర్మాణానికి తొగుట మండలంలోని నాలుగు గ్రామాల్లో ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. తుక్కాపూర్, ఎల్లారెడ్డిపేట, బండారుపల్లి, ఘనపూర్ గ్రామాల్లోని 578 మంది రైతుల నుంచి 516 ఎకరాల 27 గుంటల భూమిని 2020లో ప్రభుత్వం సేకరించి ఇరిగేషన్ అధికారులకు అప్పగించింది. అందుకు గాను రైతులకు ఎకరాకు రూ.13 లక్షల చొప్పున పరిహారం చెల్లించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ భూమిని అధికారులు రికార్డుల్లో నీటిపారుదలశాఖ పేరిట ఆన్‌లైన్ చేయాలి. కానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆన్‌లైన్‌లో ఇంకా రైతుల పేరుమీద చూపిస్తుంది. ఇదే అదునుగా భావించిన దళారులు ఆ భూమిపై కన్నేశారు. అనుకున్నదే తడువుగా కొందరు దళారులు రైతులను మచ్చిక చేసుకున్నారు. ఓ గ్రామంలో సర్కారుకు రిజిస్ట్రేషన్ చేసిన భూమిని దర్జాగా వేరే వ్యక్తులకు తొగుట తహసీల్దార్ కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్ చేయడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మల్లన్నసాగర్ అదనపు టీఎంసీ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతుల సర్వేనెంబర్లు తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నప్పటికీ కొందరు అధికారులు కాసులకు కక్కుర్తిపడి రిజిస్ట్రేషన్ల దందాకు తెరలేపినట్లు సమాచారం. రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో పెద్దఎత్తున చేతులు మారాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మల్లన్నసాగర్ రిజర్వాయర్ వద్ద ఎకరా రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు పలుకుతున్నది. దీంతో దళారులు రియల్టర్ల అవతారమెత్తి అదనపు టీఎంసీ కాలువ భూములపై కన్నువేశారు. కొనుగోలుదారులను దళారులు బుట్టలో దింపి భూముల క్రయవిక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఇటీవల ఈ దందా భారీగానే జరిగినట్లు సమాచారం. అందుకుగాను ఒక్కో రైతుకు దళారులు సుమారు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు చెల్లించి మిగతా డబ్బును దళారులు సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే రెవెన్యూ అధికారులకు భారీగా సొమ్ము ముట్టజెప్పినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మల్లన్నసాగర్ అదనపు టీఎంసీ కాలువ భూబాగోతంపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు.



తొగుట తహసీల్దార్ కార్యాలయం

అధికారుల నిర్లక్ష్యం..

మల్లన్నసాగర్ రిజర్వాయర్ అదనపు టీఎంసీ కాలువ నిర్మాణం కోసం రైతులనుంచి సేకరించిన భూమిని అధికారులు ఇరిగేషన్‌శాఖ పేరిట ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులు 2023 డిసెంబరు 28న ఒకసారి, 2024 జూన్ 29, అదే విధంగా జూలై 15న ఉన్నతాధికారులకు దరఖాస్తు చేశారు. అయినా రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అదనపు టీఎంసీలో ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన భూమిని మరోమారు రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు దళారులు తెరతీయడానికి వెసులుబాటు చిక్కింది.

బాధ్యులపై చర్యలు తప్పవు

మల్లన్నసాగర్ అదనపు టీఎంసీ కాలువ నిర్మాణం కోసం రైతుల నుంచి సేకరించిన భూమిని ఆన్‌లైన్ చేయడం ఆలస్యం కావడంతో మూడు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు మా దృష్టికి వచ్చింది. వెంటనే ఆ రిజిస్ట్రేషన్‌లను రద్దుచేశాం. రైతుల నుంచి సేకరించిన మిగతా భూములను ఆన్‌లైన్ చేస్తున్నాం. ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలు చేపడతాం.

- సదానందం, సిద్దిపేట ఆర్డీవో

'రైతు బీమా'కు రెండు రోజులే గడువు

- కొత్త పాస్‌పుస్తకాలు వచ్చిన వారికి అవకాశం
- రైతువేదికల్లో దరఖాస్తుల స్వీకరణ

సిద్దిపేటరూరల్, ఆగస్టు 2: కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు వచ్చిన రైతులు రైతుబీమా పథకానికి నమోదు చేసుకునేందుకు ఇంకా రెండు రోజులే గడువు మిగిలి ఉంది. అర్హుల నుంచి బీమా పత్రాలను వ్యవసాయ అధికారులు రైతువేదికల్లో స్వీకరిస్తున్నారు. సిద్దిపేట వ్యవసాయ డివిజన్ పరిధిలో మొత్తం 65,292 మంది రైతులున్నారు. ఇందులో అర్హత కలిగిన రైతులు 42,672 మంది ఉన్నారు. ఇప్పటి వరకు 35,958 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం పూర్తయింది. కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన 6,714 మంది రైతులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. కొత్తగా దరఖాస్తు చేసుకునే రైతులు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు, నామిని వివరాలు, సంబంధిత వ్యవసాయ అధికారులకు ఆగస్టు 5లోపు అందించాల్సి ఉంది.

రైతు కుటుంబానికి ఆర్థిక భరోసా

రైతు కుటుంబానికి ఆర్థిక భరోసా అందించాలని రైతుబీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. కుటుంబపెద్దను కోల్పోతే ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండేలా రూ.5లక్షలు అందేలా ఈ పథకం దోహదపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వమే రైతుల పక్షాన బీమా ప్రీమియం మొత్తాన్ని చెల్లిస్తుంది. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన అర్హులైన రైతులు రైతుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. 59 ఏళ్లలోపు ఉన్న రైతుల జాబితాను ఏఈవోల ద్వారా గ్రామాల్లో సమాచారం అందజేశాం. నమోదుకు రెండు రోజుల గడువు మాత్రమే ఉంది.

- పద్మ, ఏడీఏ, సిద్దిపేట



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

ప్రజల సహకారంతోనే స్వచ్ఛదనం-పచ్చదనం

- ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొనాలి
- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, ఆగస్టు 2 : ప్రజల సహకారంతోనే స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం విజయవంతం చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. ఈ నెల 5 నుంచి 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల నిర్వహణపై శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలో కలెక్టర్ మనుచౌదరి జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. 5న గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు, మహిళా సంఘాలు, యువత, ప్రముఖులతో కార్యక్రమం, గ్రామ, మున్సిపల్‌స్థాయిలో ప్రతి ఇంటి నుంచి వ్యర్థాలు సేకరించడం, ఆ వ్యర్థాలతో వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేయాలని తెలిపారు. చెత్త సేకరణ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం అమర్చాలని సూచించారు. మరుగుదొడ్లు లేని కుటుంబాలను గుర్తించి మంజూరు చేయాలని చెప్పారు. 6న తాగునీటి ట్యాంకులు శుభ్రపర్చడం, క్లోరినేషన్ నిర్వహించేలా చైతన్యపరచాలని సూచించారు. ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 7న మురుగుకాల్వలు పూడిక తీయడం, వర్షం, మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైయినేజీల్లోకి మళ్లించాలన్నారు. 8న వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, డయేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వీధి కుక్కలు సంచరించే ప్రాంతాలను గుర్తించి యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రంలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించాలన్నారు. 9న ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించడంపై అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి తొలగించాలన్నారు. ఈ ఐదు రోజుల్లో ఎప్పుడైనా వనమోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించి రోడ్ల పక్కన ఎండిపోయిన చెట్లను తొలగించి అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టి మొక్కలు నాటాలని, కమ్యూనిటీ ప్లాంటేషన్, ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేసి ఇంటి పరిసరాల్లో నాటేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీపీవో దేవకీదేవి, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాటలు..మంటలు

వారంలో ఒకరోజు సిద్దిపేటకు వస్తా..

- కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి

సిద్దిపేటటౌన్, ఆగస్టు 2 : రానున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ అన్ని స్థానాలను కైవసం చేసుకునేలా కార్యచరణ రూపొందిస్తామని, వారంలో ఒకరోజు తాను సిద్దిపేటలో పర్యటిస్తానని, ఉమ్మడి మెదక్ జిల్లా నాయకులు కూడా వస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీ పథకాలు, రైతులకు లక్షన్నర రుణమాఫీని చేసిన డైనమిక్ లీడర్ సీఎం రేవంత్‌రెడ్డి అని హనుమంతరావు స్పష్టం చేశారు. పదేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కొత్త సంసారాన్ని సెట్ చేసుకోవాలంటే ఇంకా కొంత సయం పడుతుందని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల అప్పు చేసిందని, ఆ భారమంత ప్రజలపై మోపిందని చెప్పారు. ప్రభుత్వ, వక్ఫ్ బోర్డు, అసైన్‌మెంట్ భూములను కూడా వదలలేరని, అన్నీ అమ్ముకుని కేసీఆర్ కుటుంబం రూ.లక్షల కోట్లు సంపాదించుకున్నారని ఆరోపించారు. పదేళ్లలో కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, మీరు ఎన్ని ఇబ్బందులు పడ్డారో తనకు తెలుసన్నారు. వారందరికీ అండగా ఉంటానని హామీనిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ తమ అవసరాలు, రాజకీయ లబ్ధి కోసం ఒక్కో ప్రాంతంలో ఒక్కో పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని నియోజకవర్గాలను సమానంగా చూస్తూ అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఆగస్టు పూర్తయ్యేలోపు రూ. రెండు లక్షల రుణమాఫీని అమలు చేసి తీరుతామని, ఇచ్చిన మాటకు కట్టుబడి హరీశ్‌రావు రాజీనామాకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు, దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, నర్సాపూర్ ఇన్‌చార్జి రాజిరెడ్డి, పీసీసీ సభ్యుడు సుప్రభాత్, నాయకులు సాకి ఆనంద్, రియాజుద్దీన్, ఆలకుంట మహేందర్, సందీప్ యాదవ్, కలీమొద్దిన్, మడుపు భూంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30 వేల పదోన్నతులు చరిత్రాత్మకం

గజ్వేల్ : విద్యాశాఖలో 30వేల పదోన్నతులు కల్పించడం చరిత్రాత్మకమని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. గజ్వేల్‌లో డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన ఉపాధ్యాయులకు పదేళ్ల అనంతరం సముచిత స్థానం దక్కిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు

ఏ హోదాలో సిద్దిపేటకు వస్తారు?

- వస్తే నిధులతో రండి...
- పదవి కోసమే మైనంపల్లి విమర్శలు
- బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేటటౌన్, ఆగస్టు2: మైనంపల్లి హన్మంతరావు ఏ హోదాలో సిద్దిపేటకు వస్తున్నారో స్థానిక కాంగ్రెస్ నాయకులు చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, మాజీ ఏఎంసీ చైర్మన్ పాల సాయిరాం ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల్లో తన సొంత నియోజకవర్గమైన మల్కాజ్‌గిరితో పాటు తన కుమారుడు ప్రాతినిథ్యం వహిస్తున్న మెదక్ స్థానంలో కూడా మైనంపల్లి గెలిపించుకోలేకపోయారని వారు ఎద్దేవా చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సిద్దిపేటకు ఎవరైనా రావొచ్చు.. కానీ నియోజకవర్గంలో ఆగిపోయిన నిధులను తీసుకొస్తే తాము కూడా సంతోషిస్తామన్నారు. సిద్దిపేటలో నిర్మాణంలో ఉన్న వెటర్నరీ కళాశాలను కొండగల్‌కు తరలించడంపై స్థానిక కాంగ్రెస్ నాయకుల వైఖరి ఏమిటో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. సిద్దిపేట అభివృద్ధిని ఓర్వలేని వారే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లా కేంద్రంలో నిర్మించిన మెడికల్ కళాశాలకు నిధులు తీసుకురావాలని కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావును డిమాండ్ చేశారు. రంగనాయకసాగర్ వద్ద టూరిజం అభివృద్ధి, కోమటిచెరువుపై శిల్పారామం వంటి పనులు మధ్యలోనే ఆగిపోయాయని, వాటికి నిధులు తీసుకొచ్చి మాట్లాడాలన్నారు. రాజీనామాలు బీఆర్ఎస్ పార్టీకి, హరీశ్‌రావుకు కొత్త కాదని, తెలంగాణ ఉద్యమంలో అనేకసార్లు పదవులకు రాజీనామా చేసిన చరిత్ర తమదని తెలిపారు. వ్యక్తిగత విషయాలు మాని, అభివృద్ధికి తోడ్పడాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ప్రభుత్వాలు మారడం సహజమని, మీరు సిద్దిపేట అభివృద్ధి కోసం ప్రణాళికలు రచిస్తే బాగుంటుందని సూచించారు. మల్కాజిగిరిలో ఓడిపోయిన ఆందోళనలలో మైనంపల్లి ఉన్నారని, ఆయనకు సిద్దిపేట మీద ప్రేమ ఉంటే నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఏం ప్రణాళికలు రూపొందిస్తావో, అందుకు పెన్ను, పెన్సిల్, పేపర్ తామే ఇస్తామని వారు ఎద్దేవా చేశారు. మైనంపల్లి చరిత్ర అందరికీ తెలుసని, సిద్దిపేటలోనే తనను తరిమి కొట్టారని, అది పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, సీనియర్ నాయకులు గుండు భూపేష్, వజీర్, మోహిజ్, రాములు యువజన నాయకులు రామరాజు, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు రాజనర్సు, పాల సాయిరాం

అసెంబ్లీలో గళమెత్తిన 'పల్లా'



చేర్యాల, ఆగస్టు 2 : అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి శుక్రవారం పలు అంశాలు ప్రస్తావించడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని గళమెత్తారు. రైతులకు పట్టం కడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అమలు చేసిందని, ధరణి ఆధారంగానే ప్రభుత్వం రైతుబంధు, రైతు బీమా, పంట రుణమాఫీ అమలు చేస్తున్నప్పటికీ పేరు మార్చాలనుకోవడం సరికాదన్నారు. కాస్తుకాలంలో కౌలుదారి పేరు నమోదు చేయకుండా కౌలుదారీ చట్టం సమగ్ర అమలు ఎలా చేస్తారన్నారు. నూతన భూసమగ్ర చట్టం అమలుపై ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఐదు రోజులు మోస్తరు నుంచి భారీవర్షాలు

మెదక్ అర్బన్, ఆగస్టు 2: ఉమ్మడి మెదక్ జిల్లాలో రాగల ఐదు రోజుల పాటు ఉరుముల, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం సాయంత్రం నుంచి జిల్లాలో పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది. వర్షానికి తోడుగా 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో చల్లనిగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం మెదక్, సిద్దిపేట జిల్లాలో అక్కడక్కడ గాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని తెలిపింది. ఉమ్మడి జిల్లాకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

మూగబోయిన మైదానం

- నిరుపయోగంగా సిద్దిపేటలో మినీస్టేడియం
- కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మాణం
- ఆరు నెలలుగా నిర్వహణ శూన్యం
- స్టేడియంలో ఏపుగా పెరిగిన గడ్డి
- మైదానంలో సంచరిస్తున్న పాములు, కప్పలు, కీటకాలు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 2: ఒకప్పుడు సిద్దిపేటలో సరైన మైదానాలు లేకపోవడంతో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి వెళ్లి పోటీల్లో పాల్గొనేవారు. వారి ఇబ్బందులు గమనించి గత ప్రభుత్వ హయాంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సిద్దిపేటలో కోట్ల రూపాయలను వెచ్చించి ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియాన్ని నిర్మించారు. మినీ స్టేడియంలో ఇండోర్, అవుట్ డోర్ ఆటలను కూడా ప్రారంభించారు. దీంతో ఎందరో క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోవడానికి చక్కటి వేదికైంది. అయితే, ఆరునెలల నుంచి స్టేడియంలో సరైన నిర్వహణ లేకపోవడంతో మైదానంలో పిచ్చిమొక్కలు, ఏపుగా పెరిగిన గడ్డితో అస్తవ్యస్తంగా మారింది.



మూలన పడిన కుర్చీలు, పిచ్ రోలర్

ఆనవాళ్లు కోల్పోయిన పిచ్

నాడు హైదరాబాద్ తర్వాత సిద్దిపేటలోనే క్రీడలు ఆడుకునేలా సకల సౌకర్యాలతో నిర్మించిన ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో నేడు పాములు, కప్పలు, కీటకాలు సంచరిస్తున్నాయి. నిత్యం పలు మ్యాచ్‌లతో క్రీడాకారులతో కళకళలాడాల్సిన స్టేడియం సౌకర్యాలను కల్పించకపోవడంతో వెలవెలబోతున్నది. మైదానం పుట్టగొడుగుల తోటల దర్శనమిస్తున్నది. ప్రతిరోజూ ఉదయం మైదానంలో అనేక మంది వ్యాయామం చేసేందుకు వస్తుంటారు. వారు వ్యాయామం చేసే క్రమంలో పాములు, విష కీటకాలు కుట్టే ప్రమాదం లేకపోలేదు.



పనిచేయని ఫ్లడ్‌లైట్లు



స్టేడియంలో వీరసీసాలు

మూలనపడ్డ వస్తువులు

స్టేడియంలో నిరంతరాయంగా వినియోగిస్తున్న పలు వస్తువులు ఆరునెలల నుంచి ఎండకు ఎండుతూ.. వానలో తడుస్తున్నాయి. స్టేడియంలోని క్రికెట్ పిచ్‌ను నిరంతరంగా రోలింగ్ కోసం ఉపయోగిస్తున్న రోలర్ మూలన చేరింది. స్టేడియంలో గడ్డి ఏపుగా పెరగకుండా 15 రోజులకొకసారి కత్తిరించాల్సి ఉంది. పరికరాలు తుప్పుపట్టి నిరుపయోగంగా మారుతున్నాయి. మైదానంలోని ఫ్లడ్‌లైట్లు వర్షానికి పాడయ్యాయి. జనరేటర్ సైతం మూలనపడింది. క్రీడాకారులు ఆడుకునేందుకు క్రీడావస్తువులు, గ్లౌజులు, ప్యాడ్‌లు, వికెట్లు చెదలు పట్టకుండా చూడాలని క్రీడాకారులు కోరుతున్నారు.



మైదానంలో పెరుగుతున్న పుట్టగొడుగులు



క్రికెట్ పిచ్‌లో పెరిగిన గడ్డి

జాతీయ, రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు అతిథ్యం

సిద్దిపేటలోని మినీస్టేడియంలో జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు నెలవుగా ఉండేది. ఆదివారం వచ్చిందంటే రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి సిద్దిపేటలోని మినీ స్టేడియానికి క్రీడాకారులు పరుగులు తీసేవారు. ఇక, జిల్లాలోని ఉద్యోగస్తులు, పోలీసులు, బ్యాంకింగ్ సేవలందిస్తున్న ఉద్యోగులు, పలు క్రీడా సంఘాలకు చెందిన క్రీడాకారులు క్రీడా సత్తాను చాటేందుకు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనేవారు. 2018లో వివేక్ వెంకటస్వామి మెమోరియల్ పేరిట నిర్వహించిన టీ-20 లీగ్ (టీటీఎల్) మ్యాచ్‌లకు బీసీసీఐ, హెచ్‌సీఏ నుంచి కూడా ఆమోదం లభించడంతో క్రీడాకారులు, క్రీడాభిమానులంతా ఒక్కసారిగా సిద్దిపేట వైపు చూశారు. దానికి తోడూ ఆ మ్యాచ్‌లను చూసేందుకు ప్రత్యక్ష ప్రసారాల వీక్షించే ఏర్పాట్లు చేశారు. అట్టి మ్యాచ్‌లలో సినీనటులు అక్కినేని అఖిల్, సుమంత్, హెచ్‌సీఏ నాయకులు చాముండేశ్వరీ, సుమన్ తదితరులు మ్యాచ్‌లు ఆడి క్రీడాభిమానులను ఉత్తేజపరిచారు. దాంతో పాటు ఇంటర్నేషనల్ క్రికెట్ క్రీడాకారులు అర్షద్, అయ్యుబ్, నోయల్ డేవిడ్, వెంకటపతిరాజు, సంతోష్ యాదవ్, తిలక్‌వర్మ, అజహరుద్దీన్, స్వరూప్, అంబటిరాయుడు, హెచ్‌సీఏకు సంబంధించిన అధ్యక్ష కార్యదర్శులు కూడా సిద్దిపేట స్టేడియాన్ని సందర్శించి కితాబునిచ్చారు.

పట్టించుకోని ఉన్నతాధికారులు

ఆరు నెలల నుంచి సిద్దిపేటలోని మినీ స్టేడియాన్ని యువజన శాఖ, క్రీడాశాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. గతంలో సరైన మైదానాలు లేక క్రీడలకు దూరంగా ఉంటే, ఇప్పుడు స్టేడియం అభివృద్ధి జరిగినా సౌకర్యాలు, వసతులు కల్పించకపోవడంపై క్రీడాభిమానులు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి క్రీడలు ఆడుకునేందుకు సత్వర చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

● కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ

చేర్యాల, ఆగస్టు 2: సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని కల్లుగీత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ. రమణ కోరారు. సిద్దిపేట జిల్లా గీతన్నల చైతన్యయాత్రలో భాగంగా శుక్రవారం కొమురవెల్లి మండలకేంద్రంలో సర్వాయి పాపన్న విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించి అనంతరం బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీమేరకు ప్రభుత్వం గౌడ, గీతకార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోహెడ కొమురయ్య, కుర్ర ఉప్పలయ్య, జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్, నాయకులు బండపల్లి శంకరయ్య, బాల్నె వెంకట మల్లయ్య, అనగోనినర్సింహులు, పోతుగంటి లింగం, ఆకుల కనకయ్య, యాదాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


చైతన్య మహాసభలో మాట్లాడుతున్న కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ

తల్లిపాలే పిల్లలకు శ్రేయస్కరం

● కొమురవెల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శంకరన్ ఆచార్య

చేర్యాల, ఆగస్టు 2: తల్లిపాలే పిల్లలకు శ్రేయస్కరమని కొమురవెల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శంకరన్ ఆచార్య అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కొమురవెల్లి పీహెచ్‌సీలో సూపర్‌వైజర్ పావణి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిపాలు అమృతంలాంటివని, రోగనిరోధకశక్తి కలిగిన తల్లి ముర్రుపాలను పుట్టిన గంటలోగా పట్టించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకరన్ ఆచార్య

'క్రీడలతో మానసిక ఉల్లాసం'

మిరుదొడ్డి, ఆగస్టు 2: క్రీడలు ఆడడం ద్వారా మానసిక ఉల్లాసం చేకూరుతుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎర్త్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని 8 పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, క్రీడపోటీలను నిర్వహించారు.





















'తలసరి'లో నంబర్ వన్

రాష్ట్రం కంటే సంగారెడ్డిలోనే ఎక్కువ

- వెనుకబడిన మెదక్, సిద్దిపేట
- ఉమ్మడి జిల్లాలో సగం మందికి ఉపాధి లేదు
- బడికి దూరంగా 40 శాతం పిల్లలు
- ఆర్థిక, సామాజిక నివేదిక-2024లో వెల్లడి

మెదక్, ఆగస్టు 2: తలసరి ఆదాయంలో సంగారెడ్డి జిల్లా.. రాష్ట్ర సగటు కంటే ముందంజలో ఉంది. సంగారెడ్డితో పోలిస్తే మెదక్, సిద్దిపేట జిల్లాలు వెనుకబడ్డాయి. పారిశ్రామిక రంగంతో పాటు పంటల సాగు, విద్య, వైద్య రంగాల్లోనూ సంగారెడ్డి జిల్లా మెరుగైన స్థానంలో నిలిస్తే.. మిగిలిన రెండు జిల్లాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా విభాగం విడుదల చేసిన ఆర్థిక, సామాజిక నివేదిక-2024లో ఈ విషయం వెల్లడైంది. జిల్లాలవారీగా జనాభా, అక్షరాస్యత, విద్య, వైద్య రంగాలు, వస్తు సేవల వినిమయం తదితర అంశాలను క్రోడీకరించి ప్రతీ పౌరుడి తలసరి ఆదాయం (పర్ క్యాపిటా) వివరాలు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లాలో పౌరుల తలసరి ఆదాయం రాష్ట్ర సగటు కంటే ఎక్కువగా ఉంది. (అన్నిరకాల సేవలు, వస్తువుల ద్వారా వచ్చే ఆదాయాన్ని జిల్లాలోని పౌరులందరికీ విభజిస్తే ఒక్కో పౌరుడికి వచ్చే వాటానే పౌరుల తలసరి ఆదాయంగా లెక్కిస్తారు). రాష్ట్ర సగటు తలసరి ఆదాయం రూ.3,11,649 ఉండగా.. సంగారెడ్డి జిల్లాలో ఇది రూ.3,22,394గా నమోదైంది. రాష్ట్ర సగటుకంటే జిల్లా మెరుగైన స్థితిలో నిలిచింది. మరో వైపు మెదక్ జిల్లా తలసరి ఆదాయం రూ.2,55,263, సిద్దిపేట జిల్లా తలసరి ఆదాయం రూ.2,35,218గా నివేదికలో పేర్కొన్నారు. ఈ రెండు జిల్లాలు రాష్ట్ర సగటు కంటే వెనుకబడ్డాయి.



బడికి దూరం..



అక్షరాస్యత విషయంలో సంగారెడ్డి జిల్లా కాస్త మెరుగ్గా ఉంది. జిల్లా జనాభాలో 64.07 శాతం అక్షరాస్యులు ఉన్నట్లు వెల్లడయ్యింది. మిగిలిన 35.03 శాతం పిల్లలు బడికి దూరంగా ఉన్నారు. సిద్దిపేట జిల్లాలో 61.62 శాతం అక్షరాస్యత నమోదవగా.. ఇంకా 38.38 శాతం పిల్లలు నిరక్షరాస్యులుగా ఉన్నారు. మెదక్ జిల్లాలో 56.12 శాతం పిల్లలు బడికి వెళుతుండగా.. 43.88 శాతం బడి బయటే గడుపుతున్నట్లు తెలుస్తోంది.

లింగ నిష్పత్తి

ఉమ్మడి జిల్లాలో పెద్దవారితో పోలిస్తే ఆరేళ్ల లోపు చిన్నారుల్లో లింగ నిష్పత్తి తక్కువగా ఉంది. ప్రతీ వెయ్యి మంది బాలురకు సంగారెడ్డి జిల్లాలో సగటున 955 మంది బాలికలు ఉన్నారు. మెదక్ జిల్లాలో సగటున 946 మంది బాలికలే ఉన్నట్లు నివేదికలో వెల్లడైంది. సిద్దిపేట జిల్లాలోనూ వెయ్యికి 952 మంది బాలికలు ఉన్నారు. లింగ నిష్పత్తిలోనూ సంగారెడ్డి జిల్లా మెరుగైన స్థానంలో నిలిచింది.

పనిచేసేవారూ తక్కువే

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 50 శాతం పనికి దూరంగా ఉంటున్నట్లు ఆర్థిక, సమామాజిక నివేదిక పేర్కొంది. సంగారెడ్డి జిల్లాలో పనిచేసేవారి సంఖ్య తక్కువగా ఉన్నది. జిల్లా జనాభా 15,28,903 మంది ఉండగా.. ఇందులో 6,88,760 మంది మాత్రమే వివిధ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. అంటే 45.05 శాతం మందికి మాత్రమే పనుల ద్వారా ఉపాధి లభిస్తోంది. మెదక్ జిల్లా జనాభా 7,66,153 మంది ఉండగా పనుల్లో ఉన్నవారు 3,85,206 మందికి (50.28 శాతం) పని లభిస్తున్నది. సిద్దిపేట జిల్లా జనాభా 10,12,065 మంది కాగా... వివిధ పనుల్లో ఉన్నవారు 5,09,503 మంది (50.35 శాతం) ఉన్నారు. సగటున ఉమ్మడి మెదక్ జిల్లాలో 50 శాతం మంది పనికి దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.



పరిశ్రమలకు ప్రోత్సాహమిస్తే..

ఉమ్మడి జిల్లాలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నది. ఉమ్మడి జిల్లాలో సంగారెడ్డి జిల్లా పరిధిలోనే 26,299 పరిశ్రమలు ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో 23,419, మెదక్ జిల్లాలో 15,318 పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమలు మరింత విస్తరిస్తే జిల్లావాసులకు ఉపాధి దొరుకుతుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో అపారమైన వనరులున్నాయి. పంటల సాగు, పరిశ్రమల స్థాపనకు అనువైన పరిస్థితులున్నాయి. పరిశ్రమలను ప్రోత్సహించడంతోపాటు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి పంటలకు నీరందిస్తే రైతులు ఆర్థికంగా ఎదగడం ద్వారా ఆశించిన అభివృద్ధి సాధించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

పేకాట స్థావరంపై దాడి.. 9 మంది అరెస్ట్

రూ.67,920 నగదు స్వాధీనం

మూడు కార్లు సహా 10 మొబైళ్లు, 4 మోటార్ సైకిళ్లు కూడా..

ములుగు, ఆగస్టు 2: పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు తొమ్మిది మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 67,920 నగదును స్వాధీనం చేసుకున్నారు. ములుగు మండలం క్షీరాసాగర్ గ్రామంలోని ఓ ఫామ్‌హౌస్‌లో గురువారం రాత్రి పేకాట శిబిరం నడుస్తోందని వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిందితుల నుంచి నగదుతో పాటు 10 సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలు, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పేకాట ఆడిన వారిలో అందరూ హైదరాబాద్ ప్రాంతం వారే ఉన్నారు. మామిడి మహేందర్‌రెడ్డి(బోయిన్‌పల్లి), కొండం రాజేంద్రప్రసాద్(బషీర్‌బాగ్), కాశిపాక నారాయణ(నాంపల్లి), చిత్తారు సురేష్‌కుమార్(కూకట్‌పల్లి), బత్తుల శివదుర్గప్రసాద్(కాప్రా ఈసీఎల్), నెల్లెపాల నరేష్(వనస్థలిపురం), పింక రాజేందర్(దమ్మాయిగూడ), మునుగుల వినయ్(బోయిన్‌పల్లి), పెండల యాదగిరి(బోయిన్‌పల్లి) ఉన్నారు. ఈ పేకాట స్థావరం క్షీరాసాగర్‌కి చెందిన బొడ్డు నర్సింలు, బోయిన్‌పల్లికి చెందిన గడ్డం ప్రవీన్‌యాదవ్‌లు నిర్వహిస్తున్నట్లుగా పోలీసుల విచారణలో తెలిసింది.



పోలీసుల అదుపులో ఉన్న కారు

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

నారాయణఖేడ్, ఆగస్టు 2: పట్టపగలు చోరీ చేసిన కేసులో నారాయణఖేడ్ పోలీసులు నిందితుడిని మూడు రోజుల్లో పట్టుకుని, సొత్తును రికవరీ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణరెడ్డి శుక్రవారం మీడియాకు వివరించారు. తుర్కపల్లికి చెందిన కుర్మ అంజుగొండ గత నెల 30న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పొలం పనుల కోసం వెళ్లారు.గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో ప్రవేశించి బీరువా తాళాలు పగులగొట్టి బంగారు, వెండి నగలను చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నారాయణఖేడ్ పోలీసులు విచారణలో భాగంగా మన్సూర్‌పూర్ వద్ద వాహనాలు తనిఖీచేస్తుండగా తుర్కపల్లికి చెందిన గోవింద్‌మాణిక్యం పోలీసులను చూసి ఆటో దిగి పారిపోబోయాడు. దీంతో అతడిని వెంబడించి పట్టుకున్నారు. విచారించగా, అంజుగొండ ఇంట్లో దొంగతనం తానే చేసినట్లు అంగీకరించాడన్నారు. నిందితుడి నుంచి 26 గ్రాముల బంగారు నగలు, 31.0 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గత సంవత్సరం అక్టోబరులో పట్టణంలోని ముతూట్ ఫైనాన్స్‌లో చోరీకి యత్నించిన కేసులోనూ నిందితుడని తెలిపారు. మద్యానికి బానిసై జూదం, జల్సాలకు అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీలకు పాల్పడ్డాడని వివరించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

కస్తూర్బాగాంధీ విద్యార్థినికి అస్వస్థత

మెదక్ అర్బన్, ఆగస్టు 2: మెదక్ పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సర విద్యార్థిని మానస మూడు రోజుల కింద అస్వస్థతకు గురైంది. దగ్గు, జలుబుతో బాధపడుతున్న మానసకు స్కూల్‌లోనే ప్రాథమిక చికిత్స చేశారు. గత నెల 31న విద్యార్థినిని వారి తల్లిందండ్రులకు అప్పగించారు. వెంటనే వారు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ దగ్గు తీవ్రంగా వస్తుండడంతో అన్ని వైద్య పరీక్షలు చేయగా నార్మల్ వచ్చిందని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. అగకుండా నిరంతరంగా దగ్గు రావడంతో విద్యాలయ ప్రిన్సిపల్ కవిత విద్యార్థిని పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లారు. అధికారుల సహకారంతో మెరుగైన చికిత్స కోసం మానసను నిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి తీసుకొచ్చిన దగ్గు మందు మాత్రమే మానసకు వేశామని, మరోసటి రోజు మధ్యాహ్నం వారి తల్లిదండ్రులకు మానసను అప్పగించామన్నారు. కస్తూర్బాలో ఇచ్చిన దగ్గు మందు వల్ల తన కూతురు అస్వస్థతకు గురైందని విద్యార్థిని తండ్రి స్వామి ఆరోపించారు.

ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఆందోళన



రాయదుర్గం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బంధువు మృతి చెందాడని గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ఎదుట శుక్రవారం ఆందోళన చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన వెంకటేష్(45) అనారోగ్యంతో 10 రోజుల క్రితం ఆసుపత్రిలో చేరాడు. శుక్రవారం ఉదయం కార్డియాక్ అరెస్ట్‌తో చనిపోయాడు. దీంతో మృతుడి బంధువులు వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మరణించాడని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతరెడ్డి ఆసుపత్రికి చేరుకొని బంధువులను పరామర్శించారు. ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి బంధువుల అనుమానాలను నివృత్తి చేశారు.

పురుగులమందు తాగి యువతి ఆత్మహత్య



మహేశ్వరి (ఫైల్)

చేర్యాల, ఆగస్టు 2: చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన పుప్పాల మహేశ్వరి (24) శుక్రవారం పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పుప్పాల వెంకటేశ్వర్లు, పద్మల కుమార్తె మహేశ్వరి ఎంసీఏ పూర్తి చేసి, ఇటీవల ఉద్యోగం సైతం సాధించింది. ఆమెకు కొద్ది రోజుల క్రితం యాదాద్రి-భువనగిరి జిల్లా ఆలేరు మండలం ఓ గ్రామానికి చెందిన కానిస్టేబుల్‌తో వివాహం నిశ్చయం జరిగింది. ఆమె వివాహం ఘనంగా చేయాలని తల్లిదండ్రులు ఏర్పాటు చేసుకుంటున్న క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన ఇరుగు, పొరుగు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి హుటాహుటిన చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికిత తీసుకువస్తుండగా, మార్గమధ్యంలోనే మృతి చెందింది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీజే నిర్వాహకుల నిర్లక్ష్యం

బాలుడికి విద్యుత్ షాక్

శివ్వంపేట, ఆగస్టు 2: బోనాల పండుగలో భాగంగా శుక్రవారం నిర్వహించిన తొట్టెల ఊరేగింపులో ఓ బాలుడికి కరెంట్ షాక్‌తో స్వల్ప గాయాలు అయ్యాయి. డీజే నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే బాలుడికి కరెంట్ షాక్ తగిలినట్లు గ్రామస్థులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో పోచమ్మ బోనాలలో భాగంగా గురువారం రాత్రి తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాలీ ఆటోలో డీజే సౌండ్ బాక్స్ ఏర్పాటు చేయగా, దాని వైర్ తేలి ఉంది. గమనించిన బాలుడు ఆటోను పట్టుకోగా, కరెంట్ షాక్ తగిలింది. బాలుడు స్పృహ తప్పి పడిపోగా, స్థానికులు సీపీఆర్ చేసి స్పృహలోకి రప్పించారు. అయితే, బాలుడి చేతికి మాత్రం స్వల్ప గాయమైంది.

30 ద్విచక్ర వాహనాలు సీజ్

నర్సాపూర్, ఆగస్టు 2: నిబంధనలు అతిక్రమించి నడుపుతున్న 30 ద్విచక్ర వాహనాలను సీజ్‌చేసినట్లు సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నర్సాపూర్ సమీపంలో పోలీసులు తనిఖీలు చేపట్టి లైసెన్సు, నెంబరు, సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను సీజ్‌చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపేవారు ఎంతటివారైనా చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. వాహనం నడిపేవారు 18 ఏళ్లు నిండి, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సమర్థవంతంగా నూతన చట్టాల అమలు : ఎస్పీ

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 2: నూతన చట్టాలను సమర్థవంతంగా అమలు చేస్తామని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. నూతన చట్టాల అమలు తీరుపై జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అధికారులు నూతన చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. నూతన చట్టాలపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించడం సాధ్యమవుతుందన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను సైతం స్వీకరించి, ముందస్తు విచారణ జరపాలన్నారు. ప్రతి కేసులో నేరస్తుల ఫొటోలు, వీడియోలు రికార్డు చేయాలన్నారు. కొత్త చటట్టాల అమలులో మంచి పనితీరు కనబర్చిన అధికారులకు రివార్డులు ఇవ్వనున్నట్లు ఎస్పీ తెలిపారు.

ఠాణాను తనిఖీ చేసిన ఎస్పీ



వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

వెల్దుర్తి, ఆగస్టు 2: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను స్థానిక ఎస్‌ఐ నవత గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రత్యేక సిబ్బందిని నియమించి రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణ, రాత్రి వేళ పెట్రోలింగ్, డ్రంకెన్ డ్రైవ్ చేపడుతున్నట్లు ఎస్పీ వివరించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను, బాధితుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగకృష్ణ, సిబ్బంది ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న మెదక్ వైద్యాధికారి శ్రీరామ్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

వెల్దుర్తి, ఆగస్టు 2: సీజన్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ అన్నారు. ఫ్రైడే డ్రైడే పురస్కరించుకుని శుక్రవారం ఆయన వెల్దుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రిజిస్టర్లను పరిశీలించి, స్థానిక వైద్యురాలు సౌజన్యను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానిక వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

ట్రిబుల్ ఆర్ సర్వే పూర్తి: ఆర్డీవో



సర్వే చేస్తున్న ప్రత్యేక అధికారుల బృందం

నర్సాపూర్, ఆగస్టు 2: ట్రిబుల్ ఆర్ భూసేకరణ కోసం సర్వే పూర్తయినట్లు నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లో ట్రిబుల్ ఆర్ కోసం 17 గ్రామాల్లో సర్వే చేయాల్సి ఉండగా, 13 గ్రామాల్లో సర్వే పూర్తి అయినట్లు వివరించారు. నాలుగు గ్రామాల్లో సర్వేకు వివిధ కారణాలతో రైతులు అడ్డుకుంటున్నారని, విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

ఆయిల్ బాల్స్‌తో దోమలకు చెక్



పాత ఇంజన్ ఆయిల్, వస్త్ర పీలికలతో తయారీ

నీటి గుంతల్లో, పిచ్చి మొక్కలు, తడి ఉన్నచోట ఏర్పాటు

ఖర్చు తక్కువ... ఫలితం ఎక్కువ

కంది మండలంలో ప్రయోగాత్మకం

కంది, ఆగస్టు 2: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంతో దోమలను నివారించేందుకు అధికారులు కంది మండలంలో కొత్త ప్రయోగం చేస్తున్నారు. దోమలను అరికట్టేందుకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలను ఇచ్చే ఆయిల్‌బాల్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. రోడ్లపైన పడేసిన వస్త్ర పీలికలను, వాహనాల్లో ఉపయోగించి వదిలేసిన పాత ఇంజన్ ఆయిల్‌ను ఉపయోగించి ఆయిల్ బాల్స్‌ను తయారు చేస్తున్నారు. పాత ఇంజన్ ఆయిల్‌లో ఉంచిన వస్త్ర పీలికలను బాల్ లాగా గుండ్రంగా చుట్టి నీటి కుంటల్లో, మురుగునీరు నిలిచే చోట వేస్తే దోమలు చనిపోతాయని అధికారులు చెబుతున్నారు. అంతేకాక ఈ ఆయిల్‌బాల్స్ ఉపయోగించడంతో దోమలు వృద్ధి చెందకుండా లార్వా దశలోనే అంతరిస్తాయని నిపుణులు సైతం చెబుతున్నారు. ఆయిల్ బాల్స్ ఉపయోగించడం ద్వారా చిన్న చిన్న వైరస్‌లు, క్రిమికీటకాలు కూడా మరణిస్తాయని అంచనా వేస్తున్నారు. కంది మండలంలో ఈ ఆయిల్ బాల్స్‌ను తొలిసారిగా ఎర్దనూర్, వడ్డెనగూడ తండాతో పాటు వివిధ గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద సిబ్బందితో తయారు చేయించి ప్రయోగాత్మకంగా ఉపయోగించారు. ఇదివరకు గ్రామాల్లో మురుగు కాలువల పైన బ్లీచింగ్ పౌడర్ చల్లడం, వీధుల్లో ఫాగింగ్ చేస్తూ దోమలను అరికట్టేవారు. అయినా గాని ఒకటి రెండు రోజుల్లోనే దోమలు మళ్లీ వృద్ధి చెంది ప్రజలకు డెంగ్యూ మలేరియా తదితర జ్వరాల బారిన పడేసేవి. ఇక ఇప్పుడు ఈ ఆయిల్స్‌బాల్స్ ప్రయోగం ఎంతవరకు ఫలితాలను ఇస్తుందో వేచి చూడాలి మరి.





ఆయిల్‌బాల్స్ తయారీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

దోమలు ఉండవు

పాత ఇంజన్ ఆయిల్‌తో తయారుచేసిన ఆయిల్ బాల్స్ ఉన్నచోట దోమలు వృద్ధి చెందవు. తడి ఉన్న ప్రదేశాల్లో కుంటల్లో ఈ ఆయిల్ బాల్స్‌ను వేస్తే దోమలలోని లార్వా కూడా మరణించి దోమలను పూర్తి స్థాయిగా అరికట్టవచ్చు. కంది మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రయోగాత్మకంగా పరిశీలించాం. ప్రజలు దోమ కాటుకు గురై విషజ్వరాల బారిన పడకుండా ఉండేందుకు కృషి చేస్తున్నాం.

- శ్రీనివాస్, కంది ఎంపీడీవో


ములుగు: క్షీరాసాగర్‌లో మందకృష్ణ, అంబేడ్కర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


నంగునూరు : సంబురాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


చిన్నకోడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


నారాయణరావుపేటలో సంబురాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మూడు దశాబ్దాల కల నెరవేరింది

సుప్రీంకోర్టు తీర్పుతో మూడు దశాబ్దాల కలనెరవేరిందని ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సుప్రీం తీర్పు దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గదని పేర్కొన్నారు. పలుచోట్ల ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు.

-ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్


హుస్నాబాద్ టౌన్: టపాసులు పేల్చుతున్న బీజేపీ నాయకులు


గజ్వేల్: బీజేపీ కార్యాలయంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు


దూళిమిట్ట: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు


కోహెడ: మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


మిరుదొడి: అక్బర్‌పేటలో మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


మద్దూరు: మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


మర్కుక్: చేబర్తిలో సంబురాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

ఆడబిడ్డలను అడ్డుపెట్టుకుని రాజకీయం చేయొద్దు

● కాంగ్రెస్ నాయకులు

దుబ్బాక, ఆగస్టు 2: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆడబిడ్డలను అడ్డం పెట్టుకుని అసెంబ్లీలో రాజకీయం చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, దుబ్బాక పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్‌లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, కౌశిక్‌రెడ్డిల దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉనికికోసమే ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.


దుబ్బాక: ఫ్లెక్సీని దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహిళలకు గౌరవం ఇచ్చేది కాంగ్రెస్సే

ములుగు, ఆగస్టు 2: రాష్ట్రంలోని మహిళలకు గౌరవం ఇచ్చిన ఏకైక పార్టీ కాంగ్రెసే అని గజ్వేల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వంటిమామిడిలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి మహిళలను అగౌరపరిచారని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు సరికాదన్నారు. సమావేశంలో అన్నాసాగర్ మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శశికాంత్‌రెడ్డి, రాజకుమార్, కనకయ్య ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టుకు నిధులు కేటాయింపుపై రైతుల హర్షం

● సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 2: హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో రూ. 437 కోట్లు నిధులు కేటాయింపుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో రైతులు, కూలీలు సంబురాలు జరుపుకున్నారు. శుక్రవారం మండలంలోని వంగరామయ్యపల్లి పంచాయతీలోని పూల్‌నాయక్ తండాకు చెందిన గిరిజన రైతులు, కూలీలు వ్యవసాయ పొలాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన రైతులతో పాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు, యువజన నాయకులు భూక్య రమేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.


సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం..

మంత్రి పొన్నంకు శుభాకాంక్షలు

హుస్నాబాద్, ఆగస్టు 2: గౌరవెల్లి రిజర్వాయర్‌కు రూ. 437 కోట్లు కేటాయించేందుకు రాష్ట్ర కేబినేట్ అమోదం తెలుపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, స్పూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్‌లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో నీరుమల్ల శ్రీనివాస్, కైలాసం తదితరులున్నారు.

సీఎంను కలిసిన కొమ్మూరి

చేర్యాల, ఆగస్టు 2: జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిసి జనగామ, చేర్యాల ప్రాంతాల సమస్యలతో పాటు పార్టీ స్థితిగతులను సీఎంకు విన్నవించారు.

సేవలు అభినందనీయం

చేర్యాల, ఆగస్టు 2: గ్రామీణప్రాంతంలోని పేదవిద్యార్థులకు చేయూతనందిస్తూ బీఆర్ఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కొమురవెల్లి ఎస్ఐ రాజుగౌడ్ పేర్కొన్నారు. కొమురవెల్లి మండలం కిష్టంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్‌బ్యాగులు, స్టేషనరీ విరాళంగా అందించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ రాజు హాజరైయ్యారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొంగు రాజేందర్ రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

చేర్యాల ఎస్ఐగా పి.నీరేశ్

చేర్యాల, ఆగస్టు 2: చేర్యాల ఎస్‌గా పి. నీరేశ్ నియామకమయ్యారు. బదిలీల్లో భాగంగా చేర్యాల ఎస్ఐ దామోదర్‌ను మర్కూకు బదిలీ చేయగా, సిద్దిపేట కమిషరేట్‌లో పనిచేస్తున్న నీరేశ్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. నేడో, రేపో బాధ్యతలు స్వీకరించనున్నారు.

మానవత్వం చాటుకున్న సీఐ

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 2: సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లి శివారులోని రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయపడిన ఆవు దూడను, ఆస్పత్రికి తరలించి త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని వాహనం ఢీకొని రోడ్డుపై పడి ఉన్న ఆవు దూడను గమనించిన సీఐ తన సిబ్బందిని పిలిపించి ఆవు దూడను రోడ్డు పక్కకు జరిపించారు. అనంతరం వెటర్నరీ డాక్టర్‌కు ఫోన్ చేసి పిలిపించి వైద్యం చేయించి అనంతరం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి అక్కడ ఆవు దూడను ఉంచారు.

ఎక్స్‌కవేటర్, టిప్పర్ స్వాధీనం

రాయపోల్, ఆగస్టు 2: మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఎక్స్‌కవేటర్ టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని నిందితులపై పోలీసుల కేసు నమోదు ఎస్‌హెచ్‌వో కృష్ణంరాజు కథనం ప్రకారం.. కేదావత్ సురేందర్, డ్రైవర్ అంకగాళ్ల నర్సింహులు ఎక్స్‌కవేటర్‌తో ఎలాంటి అనుమతి లేకుండా అంకిరెడ్డిపల్లి శివారులో మట్టి తవ్వి టిప్పర్‌లో తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, రాయపోల్ పోలీసులు పట్టుకున్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

చేర్యాల, ఆగస్టు 2 : మండలంలోని ఆకునూరుకు చెందిన ఏర్పుల నరేశ్, పట్టణానికి చెందిన మహమ్మద్ హలీమ్ చేర్యాల నుంచి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 10.50క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

ట్రాఫిక్ నియమాలను పాటించాలి

● సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్


మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 2: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మెదక్ రోడ్డులోని సిద్దిపేట బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, అధ్యాపకులు, ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'విద్యాసంస్థల సమయానికి అనుకూలంగా బస్సులు నడపాలి'

గజ్వేల్, ఆగస్టు 2: విద్యార్థుల కళాశాల, పాఠశాలల సమయానుకూలంగా బస్సులను నడపాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాచారం శేఖర్ కోరారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజరు కార్యాలయంలో ఈ మేరకు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలకు, పాఠశాలలకు విద్యార్థులు వెళ్లే సమయానికి బస్సులు నడపకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో వస్తున్నారని, దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. డిపో మేనేజర్ స్పందించి విద్యార్థుల సమస్య పరిష్కారం చేయాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలసి బస్ డిపో ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఆయనతో జిల్లా కమిటీ సభ్యులు వేముల ప్రవీణ్‌కుమార్, కార్తిక్, సందీప్ ఉన్నారు.

బస్సు సౌకర్యం కొనసాగించాలని వినతి

చేర్యాల, ఆగస్టు 2: చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి తదితర గ్రామాల మీదుగా సిద్దిపేట-యాదాద్రి ఆర్టీసీ బస్సును కొనసాగించాలని కోరుతూ సీపీఐ మండల నాయకుడు కత్తుల భాస్కర్‌రెడ్డి శుక్రవారం సిద్దిపేట డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లోనే బస్సు నడిపిస్తున్నారని, మధ్యాహ్నం కూడా కొనసాగించి గ్రామస్థుల ఇబ్బందులు తీర్చాలని కోరారు. ఆమె సానుకూలంగా స్పందించారని భాస్కర్‌రెడ్డి తెలిపారు.

అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేశాం

● తాజా మాజీ సర్పంచులు

చిన్నకోడూరు, ఆగస్టు 2: అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని పలువురు తాజామాజీ సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా శుక్రవారం తెల్లవారుజామున చిన్నకోడూరు పోలీసుస్టేషన్ పరిధిలోని పలు గ్రామాల తాజామాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో తాజామాజీ సర్పంచులు సుభాష్, బాబు, ఆంజనేయులు, లింగం, ఎల్లయ్య, మహేందర్ తదితరులు ఉన్నారు.

● దుబ్బాక/మిరుదొడ్డి: రాష్ట్ర ప్రభుత్వం మాజీ సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని మాజీ సర్పంచుల ఫోరం మిరుదొడ్డి మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, వంజరి శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం సచివాలయ ముట్టడికి వెళ్తున్న వివిధ మండలాల మాజీ సర్పంచులను దుబ్బాక, మిరుదొడ్డి, భూంపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల మాజీ సర్పంచులు రాజయ్య, మల్లయ్య, బుచ్చయ్య తదితరులున్నారు.


చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులు

● మద్దూరు: పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు మాజీ సర్పంచులు హైదరాబాద్‌కు తరలివెళుతున్నారన్న సమాచారం మేరకు ముందస్తుగా మద్దూరు పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో ధర్మారం సర్పంచ్ ఊట్ల రవీందర్‌రెడ్డి, లద్నూరు సర్పంచ్ జీడికంటి సుదర్శన్ ఉన్నారు.

● కొండపాక: చలో సెక్రటేరియట్ పిలుపు ఇవ్వడంతో మండలంలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు తరలివెళ్తుండగా పోలీసులు అడ్డుకొని వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. కొండపాక మండలానికి చెందిన మాజీ సర్పంచులు మహదేవ్, సురేందర్, రాజిరెడ్డి తదితరులను బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సీఎంతో ముఖాముఖికి తరలివెళ్లిన ఉపాధ్యాయులు

గజ్వేల్, ఆగస్టు 2: సీఎం రేవంత్‌రెడ్డితో ముఖాముఖికి గజ్వేల్ నియోజకవర్గ ఉపాధ్యాయులు డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లారు. గజ్వేల్ పట్టణంలోని ఆవోసీ కార్యాలయం నుంచి శుక్రవారం ఎంఈవోలు సునీత, ఉదయ్‌భాస్కర్‌రెడ్డిలతో కలసి బయలుదేరి వెళ్లారు. వారివెంట మునిసిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, గంగిశెట్టి రాజు, సుభాష్ చంద్రబోస్ తదితరులున్నారు.

'మూడోవిడత అడ్మిషన్‌లను సద్వినియోగం చేసుకోవాలి'

కుకునూరుపల్లి, ఆగస్టు 2: ఐటీఐ కళాశాలలో చేరేందుకు మూడోవిడత అడ్మిషన్‌లను స్వీకరిస్తున్నామని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. కుకునూరుపల్లి ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రిషన్ 14, ఫిట్టర్ 12, డిజిల్ మెకానిక్ 23, వెల్డర్ ట్రేడ్‌లో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరింత సమాచారం కోసం ఐటీఐ కళాశాలను సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రిన్సిపాల్‌గా బాధ్యతల స్వీకరణ


శ్రీనివాస్‌గౌడ్‌ను ఆహ్వానిస్తున్న కళాశాల అధ్యాపకులు

గజ్వేల్, ఆగస్టు 2: గజ్వేల్ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన వాసవి విద్యానగర్ జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లగా, మెదక్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

గణిత ఫోరం మండల కమిటీ ఎన్నిక

చేర్యాల, ఆగస్టు 2: చేర్యాల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల గణిత ఉపాధ్యాయులు శుక్రవారం తెలంగాణ గణిత ఫోరం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఆకునూరు జడ్పీఎస్ఎస్‌లో జరిగిన సమావేశంలో అధ్యక్షురాలిగా ఆకుల మేఘమాల, ప్రధాన కార్యదర్శిగా మల్లావజ్జల చంద్రశేఖరశర్మ, కోశాధికారిగా బ్రహ్మారెడ్డి, గౌరవాధ్యక్షుడుగా ఎం. అయిలయ్యను ఎన్నుకున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● సిద్దిపేట మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ప్రేరణ


మద్దూరు: రేబర్తిలో నీటిని పారబోస్తున్న దృశ్యం

సిద్దిపేట టౌన్, ఆగస్టు 2: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ప్రేరణ అధికారులు, సిబ్బందికి సూచించారు. సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం శానిటరి ఇన్‌స్పెక్టర్లు, జవాన్‌లతో పారిశుధ్య నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలో ఎక్కడా అపరిశుభ్రత ఉండకుండా చూడాలని, ప్రతీరోజు ఉదయాన్నే తమ తమ వార్డుల్లో పర్యటిస్తూ పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. సమావేశంలో శానిటరి ఇన్‌స్పెక్టర్లు వనిత, సతీష్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

● గజ్వేల్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ గజ్వేల్ సబ్ యూనిట్ అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ సూచించారు. గజ్వేల్ పట్టణంలో ఎపెడమిక్ సెల్ ఆధ్వర్యంలో డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని మునిసిపల్ పరిధిలోని 17వ వార్డు ముట్రాజ్‌పల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాదులపై అవగాహన కల్పించారు. ఆయనవెంట ఎపెడెమిక్ సెల్ సభ్యులు దేవసాని వాసుదేవ్, నాగరాజు, ఏఎన్ఎం ఉమ, ఆశావర్కర్లు మహేశ్వరి, రేణుక, అంగన్‌వాడీ టీచర్లు యూ.కవిత, చింతకింది పద్మ, మునిసిపల్ సిబ్బంది వెంకటయ్య, సత్తయ్య, నర్సింహులు ఉన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. మునిసిపల్ పరిధిలోని 16వ వార్డులో డ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పరిభుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆయనవెంట మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య, కౌన్సిలర్ శీర్ల శ్యామల, మల్లేశ్, తలకొక్కుల భాగ్యలక్ష్మీ, దుర్గాప్రసాద్, శానిటరి ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులున్నారు.


సిద్దిపేట: సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ప్రేరణ

● మద్దూరు: వ్యర్థ నీటి నిల్వలు లేకుండా చేసి దోమలు వృద్ధి చెందకుండా చూడాలని పంచాయతీ సెక్రటరీ మాదవ్ జాదవ్ సూచించారు. శుక్రవారం డ్రైడేను పురస్కరించుకుని గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా నీటి నిల్వలున్న ఇళ్లను పరిశీలించి పారబోయించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. గర్భిణీలకు, బాలింతలకు గుడ్లు, బాలామృతం ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, ఆశాలు కనకలక్ష్మి, కవితతో తదితరులు పాల్గొన్నారు.

● చేర్యాల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని చేర్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి పేర్కొన్నారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు.

రైతు బజార్లో అసౌకర్యం కలగకుండా చూడాలి

● కలెక్టర్ మను చౌదరి


రైతు బజార్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి పక్కన డీఎంవో నాగరాజు

సిద్దిపేట అగ్రికల్చర్, ఆగస్టు 2: సిద్దిపేట పట్టణంలోని రైతు బజార్లో రైతులకు, కొనుగోలుదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు ఉండేలా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజును ఆదేశించారు. సిద్దిపేట పట్టణంలోని రైతు బజార్‌ను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి అక్కడున్న వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బోర్డుపై సూచించిన ధరలకే క్రయవిక్రయాలు జరిగేలా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. సిద్దిపేట పట్టణంలో ఉన్న సెట్విన్ సాంకేతిక శిక్షణ సంస్థను కలెక్టర్ మను చౌదరి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు తయారుచేసిన వస్తువులను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సెట్విన్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు ఎక్కడికి వెళ్లినా ఉత్తమ పనితీరు కనబరిచేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు.

ప్రజల సూచనలు పాటిస్తాం

● సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి


అభిప్రాయాలను సేకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో బన్సీలాల్

గజ్వేల్, ఆగస్టు 2: స్టీల్ ఫ్యాక్టరీ విస్తరణలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన సలహాలు, సూచనలను పాటిస్తామని సిద్దిపేట అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ కుమార్‌పరాగ్ తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని స్టీల్ ఫ్యాక్టరీ విస్తరణపై పీసీబీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. పలువురు పర్యావరణ వేత్తల సలహాలను సేకరించారు. వారివెంట ఆర్డీవో బన్సీలాల్, మర్కుక్ మాజీ ఎంపీపీ పాండుగౌడ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీలను వేరుచేయడం సరికాదు'

మిరుదొడ్డి, ఆగస్టు 2: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం సరికాదని మిరుదొడ్డి అంబేడ్కర్ సంఘం నాయకులు రాజేశం, రామచంద్రం, మల్లయ్య, సుదర్శన్, కుమార్, స్వామిలు పేర్కొన్నారు. మిరుదొడ్డిలో శుక్రవారం వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను మాలలు వ్యతిరేకిస్తున్నారని వారు తెలిపారు. భవిష్యత్తులో మాలలు ఎకతాటిపైకి వచ్చి ఉద్యమిస్తారని హెచ్చరించారు. వారివెంట అంబేడ్కర్ సంఘం నాయకులు తదితరులున్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి మహిళా శక్తి

● వెటర్నరీ ఏడీ రమేష్


మాట్లాడుతున్న వెటర్నరీ ఏడీ రమేష్

జగదేవ్‌పూర్/మద్దూరు, ఆగస్టు 2: మహిళల ఆర్థిక అభివృద్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పశుసంవర్ధక శాఖ జిల్లా అదనపు డైరెక్టర్ రమేష్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మహిళా శక్తి లబ్ధిదారులకు మహిళా శక్తి కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా శక్తి ద్వారా జిల్లాకు 3027 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఆవు, గేదెలతో ఉపాధి పొందుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ మధుసూదన్, డీపీవో వాసుదేవ్, ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి, పశువైద్యధికారి శ్వేత, సిబ్బంది బాబు, నాగరాజు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు. డైయిరీ యూనిట్ ద్వారా జీవనోపాధి పొందే మహిళా లబ్ధిదారులకు పశు ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో పశువైద్యాధికారులతో ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి హరికిషన్ మాట్లాడారు. 3 రకాల పశువుల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తీసుకున్న రుణం ఏ విధంగా చెల్లించాలి, ఇన్సూరెన్స్ ఏ విధంగా తీసుకోవాలని అనే అంశాలపై అవగాహన కల్పించారు. మండలంలోని 35 గ్రామైఖ్య సంఘాల్లోని 172 గ్రామ సంఘాల సభ్యులు డైయిరీ యూనిట్ నిర్వాహణకు ఎంపికయ్యారని, వీరికి స్త్రీ నిధి నుంచి గానీ బ్యాంకు నుంచి గానీ గ్రామ సంఘాల నుంచి గానీ రూ.93 వేల వరకు రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ స్వప్న, మండల సమాఖ్య అధ్యక్షురాలు నవనీత, సీసీలు ప్రేమలత పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే రైతుబాట

● డీఈ భానుప్రకాష్

జగదేవ్‌పూర్, ఆగస్టు 2: గ్రామాల్లో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే రైతుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని డీఈ భానుప్రకాష్ పేర్కొన్నారు. మండలంలోని గొల్లపల్లిలో శుక్రవారం రైతుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో పర్యటిస్తూ విద్యుత్ సమస్యలను రైతులను, గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. చిన్నచిన్న సమస్యలను అక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం రైతుబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను గుర్తించి అక్కడే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా రైతులు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. గొల్లపల్లికి నూతనంగా సబ్‌స్టేషన్ మంజూరు కావడంతో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శివశంకర్, లైన్‌మెన్ మల్లేశం, మాజీ ఎంపీటీసీ రమేష్‌యాదవ్, కార్యదర్శి వెంకటేశం, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మర్పడగ క్షేత్రంలో ఘనంగా ఆర్ద్ర మహోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

కొండపాక, ఆగస్టు 2: మండలంలోని మర్పడగ విజయదుర్గాసమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో శుక్రవారం ఆర్ద్రా మహోత్సవం, మల్లికార్జునస్వామికి అన్న పూజ, రాహు కాల పూజ కార్యక్రమాలు వైభవోపేతంగా జరిగాయి. క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథ్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తివాచనంతో కార్యక్రమాలు ప్రారంభం పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశార. కార్యక్రమాల్లో క్షేత్రనిర్వహణా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో గోరింటాకు సంబురాలు


గోరింటాకును చూపుతున్న విద్యార్థులు

బెజ్జంకి, ఆగస్టు 2: ఆషాఢమాసం సందర్భంగా బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం గోరింటాకు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి గోరింటాకును చేతులకు పెట్టుకున్నారు. గోరింటాకు విశిష్టత గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు చెప్పారు.